క్లుప్తంగా

జడ్చర్లలో మంత్రి శ్రీహరికి ఘనస్వాగతం



జడ్చర్ల: మంత్రి వాకిటి శ్రీహరికి మంగళవారం జడ్చర్లలో ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంత్రి వెంట ఉండగా.. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్త బస్టాండ్ బ్రిడ్జి వద్ద బాణాసంచా కాల్చారు. గజమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శివ కుమార్, నాయకులు మినాజ్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: అలాగే దేవరకద్రలో మంగళవారం సాయంత్రం మంత్రి వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. పలువురు మంత్రికి పూలదండలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఫారూఖ్‌అలీ, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహులు, రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకే వార్డుగా చేయాలని ఓటర్ల విన్నపం



దేవరకద్ర: మున్సిపాలిటీలో కొత్తగా ప్రకటించిన వార్డుల విభజన సక్రమంగా జరగలేదని.. ఒకే ప్రాంతంలోని ఓటర్లను మూడు ముక్కలు చేశారని పలువురు ఓటర్లు మంగళవారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పాత పంచాయతీ పరిధిలోని 13, 14వ వార్డుకు సంబంధించి బీసీ కాలనీ, స్టేషన్ ఏరియాలో 733 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వార్డుల విభజనలో ఒకే ప్రాంతం ఓటర్లను అటుఇటు చేశారని.. దీనివల్ల అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారుతుందని తెలిపారు. రెండు వార్డుల్లో ఉన్నవారిలో 133 మంది ఓటర్లను కొత్తగా ఏర్పాటు చేసిన 2వ వార్డులో కలిపారని, 173 మంది ఓటర్లను 12వ వార్డు బలుసుపల్లిలో చేర్చి, మిగతా 426 మంది ఓటర్లను 11వ వార్డులో చేర్చారని ఆరోపించారు. బీసీకాలనీ, స్టేషన్ ఏరియా ఓటర్లను కలిపి ఒకవార్డుగా చేయాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్ సీత్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



కోయిల్‌కొండ: నారాయణపేట నియోజకవర్గంలోని మండలాల్లో సొంత ఇల్లులేని జీపీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జీపీ కార్మికులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కాళప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జీపీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజ్జుపాషా, గోపాల్, వెంకటయ్య, మైబు, కొండన్న, అంజి, వెంకటయ్య, వడెన్న, బాలకృష్ణ, మొగులప్ప, ఇష్మాయిల్, దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్కారభారతి వ్యవస్థాపకుడికి నివాళి



జడ్చర్ల టౌన్: పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో మంగళవారం సంస్కార భారతి వ్యవస్థాపకుడు యోగేంద్రజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగేంద్రజీ చిత్రపటానికి సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తిని పెంపొందించడంలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఉర్సు పోస్టర్ విడుదల

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎర్రకుంట సమీపంలోని బాదెషా బౌలి వద్ద ఉన్న హజ్రత్ బర్హానే బాదెషా రహెమతుల్లా అలై దర్గా ఉర్సు ఈనెల 21 నుంచి ప్రారంభం కానుందని దర్గా ముతావలి డాక్టర్ షా మహ్మద్ గయాజ్‌పాషా ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో మౌలానా మొహిసిన్ పాషా ఖాద్రీ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ విజయేందిర బోయి
- రెవెన్యూ సదస్సుల పరిశీలన



అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ రూరల్: భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఘన్సీరామ్, డీటీలు దేవేందర్ కేసిరెడ్డి, సునీల్, ఆర్ఐలు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ వాతావరణం ఉట్టిపడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బుధవారం నుంచి జరిగే అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభం పండగ వాతావరణం ఉట్టిపడాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈనెల 10 నుంచి 17వరకు నిర్వహించనున్న అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మహిళా, శిశు, సంక్షేమ, దివ్యాంగులు వయో వద్ధుల సంక్షేమశాఖ అధికారిణి జరీనా బేగం, డీఈవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సంఘాల్లో చేర్పించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళా స్వయం సహాయక సంఘాల్లో వందశాతం మహిళలను సభ్యులుగా చేర్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఏఈలతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నెలాఖరులోగా ఈ కార్యక్రమం పూర్తిచేయాలని సూచించారు. ప్రతి గ్రామసంఘం పీడబ్ల్యూడీ, ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేయాలని సూచించారు. మండలానికి 3వేల మంది ఎస్‌హెచ్‌జీ, నిరక్షరాసులను గుర్తించాలన్నారు. కొత్తగా ఏర్పడిన ఎస్‌హెచ్‌జీ లీడర్లకు షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇవ్వాలన్నారు. బ్యాంకు లింకేజీ కింద రుణ లక్ష్యం పూర్తిచేసేలా మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వేతనం పెరిగేలా సరైన కొలతలతో పని ఇవ్వాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 17 పీఎం విశ్వకర్మ దరఖాస్తులను కార్యదర్శులు పరిశీలించి ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్డీఓ నర్సింహులు, గృహ నిర్మాణశాఖ పీడీ వైద్యంభాస్కర్, పరిశ్రమల శాఖ జీఎం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

15నుంచి పీఎం ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీఎం ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాల్లో ఈనెల 15నుంచి 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ప్రకటించబడిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ మహా అభియాన్, ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాలపై అవగాహన కల్పించేందుకు లబ్ధిదారులకు నిర్వహిస్తున్న ప్రత్యేకమైన శిబిరాల్లో జిల్లాలోని ఎంపిక చేయబడిన గిరిజన గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అవగాహన సదస్సులు నిర్వహించి సంబంధిత మండల అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, రేషన్, ఆధార్, కేసీసీ, జన్‌ధన్ ఖాతా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి మంజూరుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లాలో జన్మన్, పీఎం ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద ఎంపిక చేయబడిన గిరిజన గ్రామాల గిరిజనులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



ప్రొసీడింగ్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల: ప్రభుత్వం భూ సమ్యల పరిష్కారం కోసం ప్రతిగ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మల్లెబోయిన్‌పల్లిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై భూ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిష్కారమైన సమస్యలపై రైతులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ మండలంలో..

రాజాపూర్: భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని జాయింట్ కలెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించి అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ సత్యయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సభలో 29 దరఖాస్తులు

నవాబుపేట: మండలంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో 29 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. డీటీ సువర్ణ, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే..

దేవరకద్ర: మండలంలోని గుడిబండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ కృష్ణయ్య హాజరయ్యారు. పలువురు రైతులు దరఖాస్తులు చేసుకున్నారు.

అర్బన్ మండలంలో 379..

మహబూబ్‌నగర్ రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో మంగళవారం ముగిశాయి. అర్బన్ మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఈనెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ సదస్సులు నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ ఘన్సీరామ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. ఎర్రవల్లి రెవెన్యూ సదస్సులో 38, బోయపల్లిలో 51, పాలకొండలో 52, ఏనుగొండలో 29, ఎదిరలో 114, మహబూబ్‌నగర్‌లో 115 చొప్పున మొత్తం 379 దరఖాస్తులు వచ్చాయి.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



డీపీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీల్లో నిధుల్లేక కార్యక్రమాలు కొనసాగడ లేదని.. దీంతో అనేక కష్టాలు పడుతున్నామని.. వెంటనే మా కష్టాలు తీర్చండని పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. నిధుల లేమితో కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేయకలేక పోతున్నామని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని కోరు తూ మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేయాలని, వర్షాకాలంలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలంటే నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం డీపీఓ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి పాండు,నాయకురాలు నర్మద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు..



కుమారుడిని తల్లికి అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

జడ్చర్ల టౌన్: బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యంలో టాయిలెట్‌కు దిగి కొడుకును మర్చిపోయి బస్సు ఎక్కి హైదరాబాద్ వెళ్తున్న ఓ తల్లికి తిరిగి ఆర్టీసీ అధికారులు కొడుకును అప్పగించిన ఘటన మంగళవారం జడ్చర్ల బస్టాండ్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా.. వనపర్తికి చెందిన పద్మ ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమారుడితో కలసి వనపర్తి బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు జడ్చర్ల బస్టాండ్‌కు చేరుకోగానే టాయిలెట్ కోసం దిగింది. తల్లితోపాటు కుమారుడు కిందకు దిగాడు. ఇది గమనించని పద్మ తిరిగి బస్సు ఎక్కగా హైదరాబాద్ బయలుదేరింది. బస్టాండ్‌లో తల్లి కనిపించకపోవడంతో బాలుడు ఏడుస్తూ నిలబడి ఉండడాన్ని ప్రయాణికులు ఆర్టీసీ అధికారుకు తెలిపారు. స్టేషన్ మేనేజర్ జయరాజ్, ఏడీసీ నర్సింహులు, ట్రాఫిక్ గైడ్ శివరాములు, వెంకటయ్య, సెక్యూరిటీ నర్సింహులు బాలుడి వద్ద సేకరించిన సమాచారం మేరకు బస్టాండ్‌లోకి వచ్చిన బస్సుల డ్రైవర్లు, కండక్టర్లకు ఫోన్‌లు చేసి వివరాలు తెలిపి తెలుసుకొన్నారు. పద్మను జడ్చర్ల బస్టాండ్‌కు రప్పించి కుమారుడిని అప్పగించారు. తల్లి కన్నీరు మున్నీరై ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసింది.

జలశక్తి బృందం శాస్త్రవేత్త పర్యటన



జడ్చర్ల టౌన్: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి, గొల్లపల్లి, ఆలూరు, గంగాపురం, నెక్కొండలో మంగళవారం కేంద్ర జలశక్తి బృందం శాస్త్రవేత్త సుధీర్‌కుమార్ పర్యటించారు. 2019నుంచి 2022 వరకు చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాల్లో పదిశాతం ఆయన పరిశీలించారు. ఎంఆర్‌డీ నుంచి ఆయన పైగ్రామాల్లో పర్యటించి ఇంకుడుగుంతల స్థితిగతులను పరిశీలించారు. లబ్ధిదారులతోనూ మాట్లాడి ఇంకుడుగుంతల వల్ల ప్రయోజనాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీబీటీ హెచ్‌ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ విజయ భాస్కర్‌రెడ్డి, ఈసీ, టీఏ, కార్యదర్శులు, మాజీ సర్పంచులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి జూలై 9న దేశవ్యాప్త చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ అడ్డాల వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరరం వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి చంద్రకాంత్, నర్సింహులు పాల్గొన్నారు.

మతోన్మాదులను వ్యతిరేకించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్:మతోన్మాదులను వ్యతిరేకించాలని సీపీఎం జాతీయ నాయకుడు వెంకట్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించి పాలకవర్గాలు, కార్పొరేట్లు ప్రభుత్వాలను నడుపుతున్నాయని ఆరోపించారు. మైనార్టీ, మెజార్టీ రెండూ ప్రమాదకరమైనవి.. రెండింటికీ వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3.50లక్షలు విరాళం

భూత్పూర్: మండలంలోని పాతకప్పెటలో కపిలేశ్వర స్వామి ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన మన్నెపురెడ్డి కుమార్తెలు మమత, సరిత రూ.3.50లక్షలు ఆలయ నిర్మాణ కమిటీకి మంగళవారం అందజేశారు.

విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

భూత్పూర్: మండల కేంద్రంలోని విత్తనాల విక్రయ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రవీందరెడ్డి, ఎఫ్ఆర్ఓ రమేశ్ తనిఖీలు చేశారు. శ్రీనివాస ట్రేడర్స్, ఎమ్మార్ సీడ్స్ విత్తన దుకాణాలపై స్టాక్ నిల్వలు, డెలివరీ చాలన్స్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు, లైసెన్స్‌లను పరిశీలించారు.

రాహుల్, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



నవాబ్‌పేటలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి లభించడంపై మంగళవారం కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ లింగం, పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య మాట్లాడుతూ.. జిల్లాకు మంత్రి పదవులతో పాలమూరు జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతోపాటు బీసీలకు పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి కులగణన చేసిన పార్టీవారికి సముచిత స్థానం కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే సీఎం మాటలు నిజం చేస్తూ ముదిరాజ్ నాయకుడికి మంత్రి పదవి ఇచ్చి అటు బీసీలు, రాష్ట్రంలో పెద్ద సామాజిక వర్గానికి న్యాయం చేశారని పేర్కొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నీలకంఠ, హమీద్, రాజేశ్, ఖాజా, సత్యం, నర్సింహులు, వెంకటయ్య, ఆనంద్, అంబాదాస్, ఆంజనేయులు, కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: రోడ్లపై చెత్త వేస్తే రూ.500ల నుంచి రూ.5వేల వరకు జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 21వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలోకి వచ్చే చెత్త బండికి తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి వేయాలని, తద్వారా కంపోస్ట్ ఎరువు తయారు చేసి ఆదాయం సమకూర్చుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. మహిళాసంఘ సభ్యులు చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చూడాలని సూచించారు. అవగాహన కల్పించేలా వార్డులో ర్యాలీ నిర్వహించారు. అక్కడినుంచి 17వవార్డులో డ్రైనేజీ డీసెల్టేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చైతన్య, రమేశ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. 17వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు వేశారు. 14వ వార్డు సంజీవయ్య కాలనీలో బడిబాటలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. అలాగే సినీనటుడు బాలకృష్ణ జన్మదినం పురస్కరించుకొని సత్యేశ్వర ఆశ్రమంలో అభిమానులు చేపట్టిన అన్నదానాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన అభిమానులు వెంకటరమణ, పరమటయ్య, వెంకటయ్య, నర్సింహులు, జగదీశ్వర్, శ్రీశైలం, శివ, మధు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా బడిబాట



మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించుకుంటున్న గ్రామసభ(ఫైల్)

- వంతులవారీగా ఉపాధ్యాయుల విధులు
- సర్కారు ఆశయం నీరుగారుస్తున్న వైనం
- తరగతి గదుల్లో గ్రామసభలు

మిడ్జిల్: ప్రభుత్వం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు పాఠపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు ఉచితంగా ఇచ్చి విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుండగా..మండలంలో ఉపాధ్యాయులు తమకేమీ పట్టనట్లు వంతులవారీగా విధులు నిర్వహిస్తూ బడిబాట కార్యక్రమాన్ని మమా అనిపిస్తున్నారు. నిత్యం వారికి తోచిన సమయంలో రోజుకు సగం మందికి వంతలవారీగా వచ్చి వాట్సాప్ గ్రూప్‌ల్లో ఫొటోలు పెట్టి ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. రోజురోజుకు ప్రైవేట్ పాఠశాలలు పైస్థాయికి ఎదుగుతుండగా.., ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతుంది. ఇటీవల బడిబాట కార్యక్రమంలో గ్రామసభ నిర్వహించాల్సి ఉండగా.. పాఠశాలలోని తరగతి గదిలో ఉపాధ్యాయులకు మాత్రమే గ్రామసభ నిర్వహించుకున్నారు. అలా జరిగితే ప్రభుత్వ లక్ష్యం గ్రామాల్లో ప్రజలకు చేరిదెలా అని ప్రజలు, విద్యావంతులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు మేలొని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి



కరపత్రాలు విడదల చేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

మిడ్జిల్: ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సైదులు సూచించారు. మంగళవారం మండలంలోని దోనూర్ రైతువేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మొక్కుబడిగా ఎరువులు ఎక్కువగా వేస్తే ఎక్కువ పంట వస్తుందని అనుకుంటారని.. అలాంటి అపోహలు వీడి మోతాదుకు మించి ఎరువుల వాడకం పంటలు, భూమి కీడు చేస్తుందన్నారు. అలాగే విత్తనాలు వేసేముందు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని భూమి సారాన్ని బట్టి విత్తనాలు వేయాలన్నారు. అలాగే మొక్కుబడిగా ఒకే పంటను ఆనవాయితీగా వేస్తే పంట దిగుబడి ఉండదన్నారు. అందుకు పంట మార్పిడి విధానం రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట, జీనుగ, జనుము వాడాలని సూచించారు. కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ చైర్మన్ జ్యోతీఅల్వాల్‌రెడ్డి, డైరెక్టర్ సత్యంగౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ దివ్య, శివరాజ్, మహేంద్ర, భాస్కర్, వ్యవసాయ అధికారి సిద్ధార్థ, ఏఈఓలు సాయికృష్ణ, శివప్రసాద్, గౌస్ తదితరులు ఉన్నారు.

నగరంలో ముమ్మరంగా '100 రోజుల ప్రణాళిక'



రవీంద్రనగర్‌లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఆయా డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులను నియంత్రించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సూచిస్తున్నారు. ఇక ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకే తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని చోట్ల ఓపెన్ ప్లాట్లలో, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేసే వ్యక్తులను, సమీప ఇంటి యజమానులను గుర్తించి నోటీసులు అందజేస్తున్నారు. అలాగే రూ.వేయి నుంచి రూ.ఐదు వేల వరకు జరిమానా విధిస్తున్నారు. నగరంలోని మెయిన్ రోడ్డుపై వివిధ దుకాణాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులను సంఘాలుగా ఏర్పడాలని మెప్మా అధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్, మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు యాదయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొంటున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



టీపీసీసీ అధ్యక్షుడి మహేశ్వర్‌గౌడ్‌ను సన్మానం చేస్తున్న సంజీవ్ ముదిరాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సంజీవ్‌ముదిరాజ్ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. 25ఏళ్లుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తన సేవలను గుర్తించి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ పార్టీని బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలంగా. తీర్చిదిద్దే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని తెలిపారు.